01-03-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు మీ అదృష్టాన్ని వజ్రతుల్యంగా తయారుచేసుకోవాలి, పురుషార్థం చేసి తండ్రి నుండి స్వర్గం యొక్క పూర్తి-పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి"

ప్రశ్న:- ఏ రహస్యం బుద్ధిలో ఒకవేళ యుక్తియుక్తంగా కూర్చున్నట్లయితే అపారమైన సంతోషం ఉంటుంది?

జవాబు:- డ్రామా యొక్క రహస్యము. ఈ డ్రామాలో ప్రతి పాత్రధారికి అవినాశీ పాత్ర లభించి ఉంది, దానిని అభినయించాల్సిందే. ఎవరి పాత్ర అరగదు మరియు చెరగదు. ఈ సృష్టి నాటకం తయారై సిద్ధంగా ఉన్నది, అదే ఇప్పుడు జరుగుతుంది, ఇప్పుడు కొత్తగా ఏమీ తయారయ్యేది లేదు... ఇందులో తారుమారు కూడా అవ్వజాలదు. కల్పం పూర్తి అయ్యాక మళ్ళీ అదే పాత్ర క్షణ-క్షణం రిపీట్ అవుతుంది. ఇది చాలా గుహ్యమైన రహస్యము, ఇది యుక్తియుక్తంగా బుద్ధిలో కూర్చున్నట్లయితే సంతోషం ఉంటుంది. లేదంటే తికమకపడతారు. బాబా అంటారు, పిల్లలూ, తికమకపడకండి. తండ్రి పట్ల నిశ్చయం పెట్టుకొని పూర్తి వారసత్వాన్ని తీసుకునే పురుషార్థం చేయండి.

గీతము:- మిమ్మల్ని పొంది మేము... (తుమ్హే పాకే హమ్నే...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన ఈశ్వరీయ పిల్లలు పాటను విన్నారు. మీరు ఇప్పుడు ఈశ్వరుని పిల్లలుగా అయ్యారని డ్రామానుసారంగా అర్థం అవుతుంది. ఈశ్వరుని ద్వారా మీరు స్వర్గానికి యజమానులుగా అవ్వడానికి వచ్చారు అనగా స్వరాజ్యాన్ని తీసుకోవడానికి వచ్చారు. నరకం యొక్క మనుష్యమాత్రులకైతే స్వర్గం అంటే ఏమిటి అనేది తెలియను కూడా తెలియదు. బాబా స్వర్గాన్ని స్థాపన చేస్తారని, తర్వాత రావణుడు నరకాన్ని స్థాపన చేస్తాడని మీకైతే తెలుసు. ఇది కూడా ఎవరికీ తెలియదు. మనం బాబా నుండి స్వర్గ రాజ్యాన్ని తీసుకుంటున్నామని మీకు తెలుసు. మనుష్యులు ఎవరైనా మరణించినప్పుడు, స్వర్గస్థులయ్యారు అని అంటారు. అనగా స్వయం గురించి ఇలా అంటున్నట్లు - మేము నరకంలో ఉన్నాము మరియు అందరూ నరకానికి యజమానులు అని. ఇది చాలా సహజమైన విషయము, తికమకపడాల్సిన అవసరం లేదు. మీ అదృష్టం ఇప్పుడు వజ్రతుల్యంగా తయారవుతూ ఉంది. వజ్రతుల్యమైన అదృష్టాన్ని తండ్రి తప్ప ఇంకెవ్వరూ తయారుచేయలేరు. తండ్రి నుండి మనం స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటున్నామని మీకు తెలుసు. నరకం ఎంత సమయం నడుస్తుంది, ఇది ఎవరికైనా అర్థం చేయించినట్లయితే, సత్యయుగము లక్షల సంవత్సరాల క్రితం ఉండేదని అంటారు. మీరు గాడ్ ఫాదర్లీ స్టూడెంట్ (ఈశ్వరీయ విద్యార్థి). గాడ్ ఫాదర్ ద్వారా స్వర్గ వారసత్వాన్ని పొందుతున్నారు. మరి బాబాను ఎందుకు మర్చిపోతారు అనేది బాబాకు అర్థం కావడం లేదు. తుఫానులైతే చాలా వస్తాయి. మరి, శ్రమించకుండా మీరు స్వర్గానికి యజమానులుగా అయిపోతారా ఏమిటి. ఎవరైనా మరణించినట్లయితే, స్వర్గవాసులుగా అయ్యారు అని అంటారు. మరి ఎందుకు ఏడుస్తారు? మీరు చప్పట్లు కొట్టాలి, సంతోషాలు జరుపుకోవాలి! ఒకవేళ స్వర్గంలోకి వెళ్ళడం అంత సులువైతే, మరి అందరికీ మాత్రలు ఇచ్చేయండి, అప్పుడు స్వర్గానికి చేరుకుంటారు. ఇక ఇక్కడ దుఃఖంలో ఉండాల్సిన అవసరం ఏముంది. దుఃఖంలో మనుష్యులు విషం తీసుకుని అయినా చనిపోతారు. సిపాయిలు ఎంతమంది మరణిస్తారు. ఒకరినొకరు హతమార్చుకుంటారు కూడా. బాబా అంటారు - అందరికీ అర్థం చేయించండి, స్వర్గానికి వెళ్ళారు అన్నప్పుడు మీరు మళ్ళీ ఎందుకు ఏడుస్తారు? వాస్తవానికి ఎవరూ స్వర్గానికి వెళ్ళలేరు, అలాగే తిరిగి నిర్వాణధామానికి కూడా వెళ్ళలేరు. ఇప్పుడు మీకు స్వర్గంలోకి వెళ్ళే ఉపాయాన్ని తండ్రే తెలియజేస్తారు. స్వర్గ రచయిత ఎప్పుడైతే స్వర్గాన్ని రచిస్తారో, అప్పుడే ఎవరైనా స్వర్గంలోకి వెళ్ళగలరు కదా. ఇప్పుడు స్వర్గ రచయిత అయిన తండ్రి వచ్చి ఉన్నారు. ఎప్పుడైతే రావణ రాజ్యం మొదలవుతుందో, అప్పుడు దేవీ-దేవతలు వామ మార్గంలోకి వెళ్ళిపోతారు అని పిల్లలైన మీకు మాత్రమే తెలుసు. ఆ సమయం నుండే వికారాలు మొదలవుతాయి. రావణ రాజ్యం ఎప్పుడు మొదలవుతుంది, దానికంటూ ఏ రోజు నిశ్చితమై లేదు. బాబా వీరిలో ఎప్పుడు ప్రవేశించారు అనేది పిల్లలైన మీరు ఏమైనా చెప్పగలరా. ఎప్పుడైతే సాక్షాత్కారం జరిగిందో, అప్పుడు వచ్చారా లేక ఎప్పుడు వచ్చారు? సాక్షాత్కారాలైతే భక్తి మార్గంలో కూడా ఇలాగే జరుగుతాయి. బాబా ఏ సమయంలో వచ్చారు అనేది తెలియదు. కృష్ణుడు వచ్చే ఘడియను చూపిస్తారు. శివబాబాకు ఘడియ మొదలైనవేవీ ఉండవు. బాబా అయితే యజమాని. ఎప్పుడు వస్తారు అనేది తెలియదు. ఇక్కడ మురళీ ద్వారా అర్థం చేసుకుంటారు.

తండ్రి అర్థం చేయిస్తారు, నేను కాలుడికే కాలుడిని, నేను అందరినీ తిరిగి తీసుకువెళ్ళాను. సత్యయుగంలోనైతే కొద్దిమంది ఉండేవారు, కలియుగంలో లెక్కలేనంతమంది మనుష్యులు ఉన్నారు. ఆత్మలందరూ తిరిగి వెళ్ళాలి. తీసుకువెళ్ళేటువంటి పండా తప్పకుండా కావాలి. నేను ఆత్మిక పండాగా అయి వచ్చాను, మిమ్మల్ని తీసుకువెళ్తాను. కొత్త ప్రపంచం కోసం మిమ్మల్ని చదివిస్తున్నాను. నరకం, స్వర్గం ఏమిటి, ఎంత సమయం నడుస్తాయి, ఎప్పుడు మొదలవుతాయి, ఈ విషయాలు సన్యాసులు మొదలైనవారెవ్వరికీ కూడా తెలియవు. రచయిత కూడా ఒక్కరే, సృష్టి కూడా ఒక్కటే. శాస్త్రాలలోనైతే అతాళము-పాతాళము మొదలైన చాలా సృష్టులను తయారుచేసేసారు, వాటి కోసం వెతుకుతూ ఉంటారు. ఒక్కొక్క నక్షత్రంలో ప్రపంచం ఉందని భావిస్తారు. తండ్రి అంటారు, నేను మళ్ళీ మీకు గీతా జ్ఞానాన్ని వినిపిస్తాను. క్రైస్టు మళ్ళీ తమ సమయానికి రావాల్సి ఉంటుంది. డ్రామా ఒక్కటే. సత్యయుగంలో దేవీ-దేవతల రాజ్యం తప్ప ఇంకేదీ ఉండదు. మనం బాబా నుండి వారసత్వాన్ని తీసుకోవడానికి వచ్చామని ఇప్పుడు మీకు తెలుసు. ఓ పతిత-పావనా రండి, అని స్మృతి చేస్తారు. కనుక తప్పకుండా సంగమంలోనే రావాల్సి ఉంటుంది. ఇప్పుడు మీకు తెలుసు, మనం ఇక్కడకు ఎందుకు వచ్చాము? ఏం తీసుకోవడానికి వచ్చాము? మీరంటారు, మేము బాబా యొక్క వారసత్వాన్ని తీసుకోవడానికి వచ్చాము. మేము రాజయోగాన్ని నేర్చుకుంటున్నాము. కల్పకల్పము వారసత్వాన్ని తీసుకుంటాము మరియు పోగొట్టుకుంటాము. ఇప్పుడు మళ్ళీ పురుషార్థం చేయాలి. పూర్తి జ్ఞానాన్ని తీసుకొని ఇతరులకు ఇవ్వాలి. లేదంటే వృద్ధి ఎలా జరుగుతుంది. పాట ఎంత బాగుంది. దీని అర్థాన్ని పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. పాట ఎంత మధురంగా ఉంది, మీ మనసుకు హత్తుకుంటుంది. బాబా, మీ నుండి మేము ఎలాంటి రాజ్యాన్ని తీసుకుంటామంటే, దానిని ఎవ్వరూ దోచుకోలేరు. ఇది అవినాశీ వారసత్వము, ఇది అవినాశీ తండ్రి నుండి లభిస్తుంది. అనాది ప్రపంచం యొక్క డ్రామా అనుసారంగా మరియు గీత యొక్క వర్ణన అనుసారంగా బాబా మళ్ళీ గీతను వినిపించడానికి వచ్చారు, అందులో రాజయోగాన్ని నేర్పించారు. శాస్త్రాలలోనైతే కలగాపులగం చేసేసారు. యుక్తిగా అర్థం చేయించేవారు కూడా కావాలి. జ్యోతి జ్యోతిలో కలిసిపోయింది అని కొందరు అంటారు. ఆత్మ అయితే అవినాశీ. అది పాత్ర కూడా అవినాశీ పాత్రను అభినయించాలి, దాని పాత్ర ఎప్పుడూ అరిగిపోలేదు. ఎప్పుడూ చెరిగిపోలేదు. ఈ సృష్టి నాటకం తయారై సిద్ధముగా ఉన్నది, అదే ఇప్పుడు జరుగుతుంది, ఇప్పుడు కొత్తగా ఏమీ తయారయ్యేది లేదు... ఇందులో మార్పు-చేర్పులు కూడా జరగజాలవు. ఎంతటి అద్భుతము. ఇంత చిన్న ఆత్మలో అవినాశీ పాత్ర నిండి ఉంది. కల్పం పూర్తయ్యాక మళ్ళీ అదే విధంగా పాత్రను రిపీట్ చేస్తారు. క్షణ-క్షణము అలాగే గడుస్తుంది. డ్రామాను కూడా పూర్తిగా యుక్తియుక్తంగా అర్థం చేసుకోవాలి. చాలామంది అయితే ఈ విషయాలలో తికమకపడతారు. ముందు అయితే, తండ్రి నుండి తప్పకుండా వారసత్వం లభించనున్నది అని తండ్రి పట్ల నిశ్చయం ఉండాలి. కల్పకల్పము భారత్ కే లభిస్తుంది. 84 జన్మలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. వర్ణాలను కూడా తప్పకుండా అర్థం చేయించాలి. మనము అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటున్నాము అని ఒకరికొకరు ఈ స్మృతినిప్పించుకోవాలి. అందరూ అయితే వచ్చి చదువుకోరు. సెంటర్లు తెరుచుకుంటూ ఉండటాన్ని చూస్తారు, అక్కడకు నరకవాసులు వచ్చి స్వర్గవాసులుగా అవుతారు. బాబాకు రాస్తారు, మేము ఏర్పాట్లు చేయగలము, మాకు ఏ వస్తువు పట్ల మమకారం లేదు, ఇదంతా ఈశ్వరార్థమే, ఇప్పుడు మీరు ఏం సలహా ఇస్తే అది. నేను కూడా రాస్తాను, పరస్పరంలో చర్చించుకోండి, ఎక్కడైతే మంచి లొకాలిటీ ఉంటుందో, అక్కడ సెంటర్ తెరవండి. పిల్లలు ధైర్యమును ఉంచితే తండ్రి సహాయము లభిస్తుంది. బాబా ఎంత సంతోషిస్తారు. అనేకులను గవ్వ నుండి వజ్రం లా తయారుచేయడము, ఇటువంటి దానమైతే బాగుంటుంది అని మనసులో అనుకుంటారు. ఇది అతి పెద్ద హాస్పిటల్ కూడా, కాలేజ్ కూడా. కేవలం 3 అడుగుల నేల కావాలి. బాబా ఎంత సహజ రీతిలో గవ్వ నుండి వజ్రంలా తయారుచేస్తారు. ఇటువంటి బాబా ఎంత సాధారణంగా ఉంటారో చూడండి. ఎక్కడికి వచ్చారు, ఏ రాజులోకైనా ఎందుకు రాలేదు! వారంటారు, నేను సాధారణ వృద్ధ తనువులోకి వస్తాను, ఎవరైతే 84 జన్మలను ఏక్యురేట్ (ఖచ్చితం)గా పూర్తి చేసారో, వారిలోకి వస్తాను. సత్యయుగం యొక్క మొదటి రాకుమారుడైతే వీరు కదా. వీరికి శ్యామ్ మరియు సుందర్ అనే పేరును కూడా పెట్టారు. పిల్లలైన మీరు దీని అర్థాన్ని కూడా అర్థం చేసుకుంటారు, వారు అర్థాన్ని తెలుసుకోని కారణంగా నల్లగా చేసేసారు. ముఖ్యమైన శివబాబా లింగాన్ని కూడా నల్లగా చేసారు. కృష్ణుడిని, రాముడిని కూడా నల్లగా చేసేసారు. ఒక చోట తెల్లగా, మళ్ళీ ఇంకొక చోట నల్లగా ఎందుకు? జగన్నాథ మందిరంలో ముఖాన్ని, ఆఫ్రికన్ల వలె చూపిస్తారు. అక్కడక్కడ నారాయణుడిని కూడా నల్లగా చేసేసారు. కొన్ని చోట్ల లక్ష్మిని కూడా ఇలాగే చూపిస్తారు. మనుష్యుల బుద్ధి ఎలా ఉంది అని ఇప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. బాబాను కలుసుకునేందుకు బాబానే సత్యమైన మతాన్ని ఇస్తారు. ఇకపోతే, యజ్ఞ తపాదులు, దాన పుణ్యాలు మొదలైనవి చేస్తారు, ఊరికినే ధనాన్ని వృథా చేస్తూ ఉంటారు. మరి పతిత-పావన రండి, అని ఎందుకు అంటారు. స్మృతి ఎందుకు చేస్తారు? గంగా, యమునా, కాలువలు మొదలైనవి ఎన్ని ఉన్నాయి. బాబా కూడా చాలా తీర్థ యాత్రలు మొదలైనవి చేసారు. ఇప్పుడు అతి ప్రియమైన, లక్కీ

సితారలైన మీరు నరకం మరియు స్వర్గం గురించి తెలుసుకున్నారు. మనుష్యులు మరణించినప్పుడు స్వర్గానికి వెళ్ళారు అని అంటారు. కావున వారికి కూడా, స్వర్గం అని దేనినంటారో అర్థం చేయించండి. మనకు తెలుసు, అందుకే అర్థం చేయిస్తాము. మనకు కూడా స్వర్గ స్థాపన చేసేటువంటి తండ్రి లభించారు, వారు జ్ఞానాన్ని ఇస్తున్నారు. మనకు మనుష్య గురువులెవ్వరూ లేరు. సద్గురువు ఒక్క బాబానే, వారే పతిత-పావనుడు, వారినే పిలుస్తారు. నిరాకారుడినే పిలుస్తారు కదా, వారిని మీరు జ్ఞాన సాగరుడు అని అంటారు. వారు సత్-చిత్-ఆనంద స్వరూపుడు, జ్ఞాన సాగరుడు. మనకైతే జ్ఞానం లేదు. వారి వద్ద ఏ జ్ఞానమైతే ఉందో, అది ఇంకెవ్వరి వద్ద లేదు అని చూడడం జరిగింది. మీరు ఎంతగా ఆనందంతో పులకరించిపోవాలి. పతిత-పావనుడైన గాడ్ ఫాదర్ మనల్ని చదివిస్తారు. వారు మన తండ్రి, టీచర్, సద్గురువు, ఇందులో గుటకలు మింగే విషయం లేదు. మీ రచననైతే సంభాళించాల్సిందే. ఒకవేళ ఇక్కడకు వచ్చి కూర్చుండిపోతే - ఇది సన్యాసుల జ్ఞానం అయిపోయినట్లు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ మీరు ఒక గంట, అర గంట తీయవచ్చు. ముందు 7 రోజుల భట్టీలో ఉండాల్సి ఉంటుంది. 7 రోజులు ఎవ్వరి స్మృతి రాకూడదు, ఎవ్వరికీ ఉత్తరం రాయకూడదు. పూర్తిగా అందరినీ మర్చిపోవాలి. మీరు చాలా సంవత్సరాలు భట్టీలో ఉన్నారు, అయినా అదృష్టము... కొందరినైతే మాయ లాగేస్తుంది. మాయ అంతటి శక్తివంతమైనది.

తండ్రి అంటారు, పిల్లలూ, నెమ్మది-నెమ్మదిగా పరిపక్వ అవస్థను చేరుకుంటూ ఉండండి. మన 84 జన్మలు పూర్తి అయ్యాయని మీకు తెలుసు. మీ బుద్ధిలో మొత్తం వృక్షము, అన్ని ధర్మాలు ఉన్నాయి. అక్కడ కూడా వేర్వేరు సెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ కూడా అలాగే, అక్కడ కూడా అలాగే. ఇకపోతే, మోక్షం ఎవ్వరికీ లభించజాలదు. నీటి బుడగ వలె ఆత్మ పరమాత్మలో లీనమవుతుందని కాదు. అలా జరిగితే మొత్తం పాత్రనే సమాప్తమైపోతుంది. అన్ని జ్యోతులు జ్యోతిలో కలిసిపోతే, ఇక ఆటే నడవదు. ఇదంతా అసత్యము. అసత్యము అంటే ఇక పూర్తి అసత్యము, సత్యమనేది ఇసుమంత కూడా లేదు. భక్తిలో ఏమైనా నోరు తీపి అవుతుందా. నోటిని ఎవరు తీపి చేస్తారు అనేది పిల్లలైన మీకు తెలుసు! కనుక తండ్రి యొక్క చదువు పట్ల పూర్తి ధ్యానం పెట్టాలి. పాత ప్రపంచాన్ని చూసి ఆకర్షింపబడకండి. దేహాభిమానంలోకి రాకండి. ఇప్పుడైతే తమ బ్యాగ్-బ్యాగేజ్ ను తయారుచేసుకుని ట్రాన్స్ఫర్ చేయండి. ఇప్పుడు ఈ ప్రపంచం సమాప్తమవ్వనున్నది. బాబా అంటారు, అంతా ఇన్స్యూర్ చేసుకోండి. భక్తి మార్గంలో చేసినప్పుడు అల్పకాలానికి ఫలం లభిస్తుంది. ఈశ్వరుడు ఇచ్చారని భావిస్తారు. ఇప్పుడు మీరు ఇస్తారు కనుక బాబా మళ్ళీ రిటర్న్ లో ఇస్తారు. డైరెక్ట్ అయిన కారణంగా మీకు 21 జన్మల ఇన్స్యూరెన్స్ లభిస్తుంది. బాబా అంటారు, చూడండి, మేము పూర్తిగా ఇన్స్యూర్ చేసుకున్నాము కనుక పూర్తి రాజ్యం లభిస్తుంది. అది దైహిక ఇన్స్యూరెన్స్, ఇది ఆత్మిక తండ్రితో ఇన్స్యూరెన్స్. ఈశ్వరార్థము దానం చేస్తారు కదా కనుక ఈశ్వరుడు రిటర్న్ లో ఇస్తారు. వారైతే భక్తి మార్గంలో కూడా దాత, అలాగే జ్ఞాన మార్గంలో కూడా దాత. ఇది అనంతమైన చదువు, అనంతమైన రాజ్యం కోసము. ఇప్పుడు ఎంత కావాలనుకుంటే అంత తీసుకోండి. విశ్వ రాజ్యాన్ని తీసుకోవచ్చు. పురుషార్థానికే విజయము. విజయమాలలో కూర్చబడేందుకు ప్రయత్నం చేయండి. తికమకపడితే, సలహానిచ్చే సర్జన్ కూర్చుని ఉన్నారు. మనం అనేక సార్లు రాజ్యాన్ని తీసుకున్నాము మరియు పోగొట్టుకున్నాము అని మీకు తెలుసు. ఈ జ్ఞానం ఇప్పుడు ఉంది, సత్యయుగంలో మళ్ళీ మర్చిపోతాము. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పాత ప్రపంచాన్ని చూసి ఆకర్షింపబడకూడదు. తమ బ్యాగ్-బ్యాగేజ్ ను ట్రాన్స్ఫర్ చేసుకోవాలి. తమదంతా ఇన్స్యూర్ చేసుకోవాలి.

2. ఒకవేళ ఏ వస్తువు పట్ల మమకారం లేకపోతే, ఇక గవ్వ నుండి వజ్రంలా తయారుచేసే సేవ చేయాలి. దానం చేయడంతోనే జ్ఞాన ధనం పెరుగుతుంది.

వరదానము:- నిమిత్త భావపు స్మృతితో ప్రతి పేపరులో పాస్ అయ్యే ఎవర్రెడీ, నష్టోమోహా భవ

ఎవర్రెడీకు అర్థమే - నష్టోమోహా స్మృతి స్వరూపము. ఆ సమయంలో ఏ సంబంధీకులు మరియు వస్తువులు గుర్తు రాకూడదు. ఎవరి పట్ల మోహం ఉండకూడదు, అందరితో అతీతము మరియు అందరికీ ప్రియము. దీనికి సహజ పురుషార్థము నిమిత్త భావము. నిమిత్తంగా భావించడంతో "నిమిత్తంగా

చేసినవారి'' స్మృతి వస్తుంది. నా పరివారము, నా పని - ఇలా ఉండకూడదు. నేను నిమిత్తుడను. ఈ నిమిత్త భావం యొక్క స్మృతితో ప్రతి పేపరులో పాస్ అయిపోతారు.

స్లోగన్:- బ్రహ్మా తండ్రి యొక్క సంస్కారాలను తమ సంస్కారాలుగా చేసుకోవడమే ఫాలో ఫాదర్ చేయడము.